# ప్రశాంతంగా కౌంటింగ్

- జిల్లాలో ముగిసిన ఓట్ల లెక్కింపు
- 8గంటలకు స్ట్రాంగ్ రూమ్ ఓపెన్
- పోస్టల్ బ్యాలెట్లతో ఓట్ల లెక్కింపు షురూ
- ఆ తర్వాత ఈవీఎంల కౌంటింగ్
- రౌండ్ల వారీగా ఎప్పటికప్పుడు ఫలితాలు విడుదల
- కౌంటింగ్ కేంద్రం వద్ద భారీ భద్రత
- మూడు కిలోమీటర్ల మేర 144 సెక్షన్



నల్లగొండలో కౌంటింగ్ కేంద్రం వద్ద పోలీస్ బందోబస్త్

రామగిరి, డిసెంబర్ 3 : అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా లెక్కింపు పూర్తయ్యింది. నల్లగొండ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించారు. అన్ని చోట్లా బీఆర్ఎస్ అభ్యర్థులు రెండో స్థానంలో నిలిచారు. ఇక శాంతి భద్రతలకు భంగం వాటిల్లకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

జిల్లా ఈవీఎంలను నల్లగొండ పట్టణంలోని మేళ్ల దుప్పలపల్లిలోని గోదాం వద్ద ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ల్లో భద్రపరిచారు. ఆదివారం ఉదయమే కౌంటింగ్ సిబ్బంది కేంద్రానికి చేరుకున్నారు. పాస్‌లు ఉంటేనే లోపలికి అనుమతిచ్చారు. లెక్కింపు ప్రక్రియ ఉదయం 8గంటలకు ప్రారంభమైంది. ఏజెంట్లు, అభ్యర్థుల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లను ఓపెన్ చేశారు.. తొలుత పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించారు. ఆ తర్వాత రౌండ్ల వారీగా ఈవీఎంలను లెక్కించారు. ఓట్లను లెక్కించేందుకు 14 టేబుళ్లను ఏర్పాటు చేశారు. కౌంటింగ్ ప్రక్రియను వెబ్ కాస్టింగ్, వీడియోగ్రఫీ, సీసీ కెమెరాల ద్వారా రికార్డు చేశారు. ఉదయం 11గంటలకే గెలుపోటములపై ఎలక్షన్ ట్రెండ్ స్పష్టత వచ్చింది. మధ్యాహ్నం 2 గంటల వరకు దాదాపుగా పూర్తి ఫలితాలు విడుదలయ్యాయి. కౌటింగ్‌లో దాదాపుగా 3,000 మంది సిబ్బంది పాల్గొన్నారు.

నల్లగొండ జిల్లాలోని ఆరు నియోజకవర్గాలు (నల్లగొండ, నకిరేకల్, మిర్యాలగూడ, నాగార్జునసాగర్, దేవరకొండ, మునుగోడు) ఫలితాల్లో ఆరంభం నుంచి కాంగ్రెస్ అభ్యర్థులే ముందు వరుసలో కనిపించారు. ఫలితాలు కాంగ్రెస్‌కు అనుకూలంగా వస్తుండడంతో ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్సా హం కనిపించింది. అయితే మధ్యాహ్నం తర్వాత కాంగ్రెస్ అభ్యర్థులు కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవడంతో సందడి వాతావరణం నెలకొంది. చివరి రౌండ్ ఫలితం వచ్చే వరకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు నల్లగొండ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, నకిరేకల్ వేముల వీరేశం, మిర్యాలగూడ బత్తుల లక్ష్మారెడ్డి, నాగార్జునసాగర్ జయవీర్‌రెడ్డి, దేవరకొండ బాలూనాయక్, మునుగోడు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి గెలుపు పత్రాలను అధికారుల చేతుల మీదుగా స్వీకరించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.

### భారీ బందోబస్తు..

కౌంటింగ్ సెంటర్ వద్ద ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకున్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద అధికారులు ఐదెంచెల భద్రతను ఏర్పాటు చేశారు. పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. లెక్కింపు కేంద్రానికి మూడు కిలో మీటర్ల వరకు 144 సెక్షన్ ఆంక్షలు అమల్లో ఉన్నాయి. సుమారు 350మంది పోలీసు బలగాలు విధులు నిర్వహించాయి. లెక్కింపు కేంద్రంలోకి సెల్‌ఫోన్లు, వాటర్‌బాటిళ్లు, సిగరెట్లు, మద్యం తదితర వస్తువులను అనుమతించలేదు. ఇక కౌంటింగ్ నేపథ్యంలో మద్యం దుకాణాలపై నిషేధం విధించారు. ఆదివారం సాయంత్రం ఆరు గంటల వరకు వైన్స్, బార్లు బంద్ చేశారు.

### త్వరలో ఎమ్మెల్సీ ఉప ఎన్నిక..!

అసెంబ్లీ ఎన్నికలు ముగియడంతో త్వరలో జిల్లాలో మరో ఉప ఎన్నిక రానుంది. ప్రస్తుతం వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీగా పల్లా రాజేశ్వర్ రెడ్డి కొనసాగుతున్నారు. ఆయన జనగాం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. దాంతో పల్లా రాజేశ్వర్ రెడ్డి ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయక తప్పదు. దీంతో మూడు ఉమ్మడి జిల్లాకు మరో ఉప ఎన్నిక అనివార్యం కానుంది.

# నల్లగొండ ప్రజలకు ధన్యవాదాలు

- ఎస్ఎల్‌బీసీ సొరంగం, బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్టు పూర్తి చేయిస్తా
- నల్లగొండ కాంగ్రెస్ విజేత కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

రామగిరి, డిసెంబర్ 3 : తన విజయానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ అండగా ఉండి పనిచేస్తానని కాంగ్రెస్ నల్లగొండ విజేత కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. నల్లగొండలోని కౌంటింగ్ కేంద్రం వద్ద ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఐదోసారి నల్లగొండ ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలిపించిన నల్లగొండ ప్రజలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గతంలో చేసిన అభివృద్ధి కంటే ఎక్కువ చేసి చూపిస్తానని అన్నారు. జిల్లాలో నిలిచిపోయిన ఎస్ఎల్‌బీసీ సొరంగంతోపాటు బ్రాహ్మణ వెల్లెంల ప్రాజెక్టును పూర్తి చేయిస్తానని స్పష్టం చేశారు. నల్లగొండలో మహాత్మాగాంధీ యూనివర్సిటీలో అభివృద్ధి పనులు పూర్తి చేయడంతో ఖాళీ పోస్టులను భర్తీచేసి ఉన్నత విద్యను అందిస్తామన్నారు. నా కోసం 24 గంటల కష్టపడిన కార్యకర్తలు, నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నల్లగొండ నియోజకవర్గ ప్రజలకు ఎంత చేసినా తక్కువేనని, నియోజకవర్గ ప్రజలకు కన్నీళ్లు రాకుండా కాపాడుతానని హామీ ఇచ్చారు.

# ప్రజల నిర్ణయం చరిత్రలో నిలిచిపోతుంది

- కాంగ్రెస్ మునుగోడు విజేత కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

రామగిరి, డిసెంబర్ 3 : తెలంగాణ ప్రజల నిర్ణయం డిసెంబర్-3 చరిత్రలో నిలిచిపోతుందని మునుగోడు కాంగ్రెస్ విజేత కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. నల్లగొండలోని కౌంటింగ్ కేంద్రం వద్ద ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. తన గెలుపునకు కృషి చేసిన మునుగోడు నియోజకవర్గ ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గ ప్రజలు నాపై విశ్వాసంతో అత్యధిక మెజార్టీతో గెలిపించినందుకు వారికి ధన్యవాదాలు చెప్పారు. తెలంగాణలో కాంగ్రెస్‌ను గెలిపించి సోనియాగాంధీకి గిఫ్ట్ ఇచ్చినందుకు ప్రజ లకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలందరికీ గతంలో మాదిరిగానే అండగా ఉండి సమస్యలు పరిష్కారిస్తానన్నారు.

# నా గెలుపునకు కృషి చేసిన వారికి కృతజ్ఞతలు

- కాంగ్రెస్ నకిరేకల్ విజేత వేముల వీరేశం

రామగిరి, డిసెంబర్ 3 : నకిరేకల్ నియోజకవర్గంలో తన గెలుపునకు కృషి చేసిన కార్యకర్తలు, నాయకులకు శిరస్సు వంచి పేరుపేరునా నమస్కారిస్తున్నానని కాంగ్రెస్ నకిరేకల్ విజేత వేముల వీరేశం అన్నారు. నల్లగొండలోని కౌంటింగ్ కేంద్రం వద్ద ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కరోనా లాంటి కష్టకాలంలో సైతం ప్రజలకు అండగా ఉండి సేవ చేశానన్నారు. ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని, విశ్వాసాన్ని కాపాడుకుంటానని స్పష్టం చేశారు.

రాబోయే కాలంలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గానీ అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. నియోజకవర్గ ప్రజలందరినీతత కంటికి రెప్పలా కాపాడుకుంటూ నకిరేకల్ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో రోల్ మోడల్‌గా ఉంచుతానని తెలిపారు.

# ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తా

- కాంగ్రెస్ మిర్యాలగూడ విజేత బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ, డిసెంబర్ 3 : మిర్యాలగూడ నియోజకవర్గంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ పా ర్టీలకు అతీతంగా ప్రజలందరికీ సేవలు అందిస్తానని మిర్యాలగూడ కాంగ్రెస్ విజేత బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. తనపై అభిమానంతో ఓటు వేసి తన గెలుపునకు కృషి చేసిన నియోజకవర్గ ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తాను చేస్తున్న సేవలను ఇక ముందు కూ డా కొనసాగిస్తానని, అందరిలో ఒకడిగా ఉంటూ ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందేలాకృషి చేస్తానన్నారు. మిర్యాలగూడను అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు పనిచేస్తానని పేర్కొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నోముల భగత్



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

# ప్రజా తీర్పును గౌరవిస్తా

- ప్రజాస్వామ్యంలో గెలుపోటములు సహజం
- కార్యకర్తలు అధైర్య పడొద్దు
- మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్

హాలియా, డిసెంబర్ 3: శాసనసభ ఎన్నికల్లో నాగార్జునసాగర్ నియోజకవర్గ ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తానని మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్ అన్నారు. ఆదివారం హాలియాలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో గెలుపోటములు సహజమని అన్నారు. నాగార్జున సాగర్ నియోజకవర్గంలో, రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ ఓడినంత మాత్రనా పార్టీ కార్యకర్తలు అధైర్య పడవద్దని కోరారు. 2018లో సాగర్ నియోజకవర్గ ప్రజలు మనకు అవకాశం ఇచ్చారు. ఐదేండ్లలో నియోజవర్గంలో శాంతిభద్రతలను కాపాడుతూ అభివృద్ధికి కృషి చేసినట్లు ఆయన పేర్కొన్నారు. తనకు ఓటేసిన ప్రజలకు, నన్ను గెలిపించేందుకు కృషి చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. రేపటి నుంచి నల్లకోర్టు వేసుకొని నిడమనూరు కోర్టులో న్యాయవాదిగా పనిచేస్తానని చెప్పారు. ఈ సమావేశంలో హాలియా మున్సిపల్ చైర్మన్ నల్లగొండ సుధాకర్, పెద్దవూర బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు రవినాయక్, ఎంపీటీసీలు వెంకటయ్య, యాదయ్య, సాగ ర్ యూత్ అధ్యక్షుడు ఆవులదొడ్డి రాహుల్, హాలియా పట్టణ అధ్యక్షుడు వడ్డే సతీష్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు కాట్నం నాగరాజు, కాశయ్య, రామునాయక్ తదితరులున్నారు.


# ప్రజలకు అండగా ఉండి పనిచేస్తా

- నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

రామగిరి, డిసెంబర్ 3 : ఎన్నికల్లో గెలుపోటములు సహజమేనని, ఎక్కడికి వెళ్లకుండా ఇక్కడే ప్రజల మధ్య ఉండి బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులకు అందరికీ అండగా ఉండి పనిచేస్తానని నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. నల్లగొండలో ఎన్నికల కౌంటింగ్ సెంటర్ వద్ద ఆదివారం మీడియాతో మాట్లాడారు. నల్లగొండ అభివృద్ధి నిలిచిపోకుండా వేయి కండ్లతో కాపాడుకుంటూ ముం దుకు వెళ్లడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు. 2014లో ఓటమి చెందిన వ్యక్తిని అని, అయినప్పటికీ తాను హైదరాబాద్‌కు పారిపోలేదన్నారు. ఆ రోజు నుంచి ఐదేండ్లు ప్రజల మధ్యలోనే ఉంటూ పనిచేసి, 2018లో గెలిచానన్నారు. రాబోయే కాలంలో మళ్లీ గెలిచి నల్లగొండను అభివృద్ధిలోకి తీసుకువెళ్లడానికి సిద్ధంగా ఉంటానని స్పష్టం చేశారు. ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తూ ముందుకు పోవడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు. రాబోయే కాలంలో ప్రజల వెంటనే ఉండి పనిచేస్తానని స్పష్టం చేశారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, పలువురు కౌన్సిలర్లు, కార్యకర్తలున్నారు.

# ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటా

- ఎన్నికల్లో నా కోసం కష్టపడిన నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు
- మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు



మిర్యాలగూడ, డిసెంబర్ 3 : అసెంబ్లీ ఎన్నికల్లో తన గెలుపు కోసం రెండు నెలలుగా ప్రచారంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామని, వెలువడిన ఫలితాల నేపథ్యంలో ప్రజా తీర్పును శిరసా వహిస్తానని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గెలుపోటములు సహజమని, ప్రజలు, బీఆర్ఎస్ శ్రేణులెవ్వరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని, తాను ప్రజలకు అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. గడిచిన పది సంవత్సరాల కాలంలో మిర్యాలగూడ నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రజలు 2014, 2018 ఎన్నికల్లో తనను ఆశీర్వదించి గెలిపించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాస్వామ్య యుతంగా జరిగే ఎన్నికల్లో గెలుపు, ఓటమి సహజమని, రానున్న రోజుల్లో బీఆర్ఎస్ పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. పదవులతో నిమిత్తం లేకుండా ప్రజలందరికీ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, నియోజకవర్గంలో ఉన్న ప్రతి బీఆర్ఎస్ కార్యకర్త ఓర్పుతో ఉండాలని, గతంలో లాగానే ప్రజల కష్టాల్లో తోడుగా ఉంటానని స్పష్టం చేశారు. ప్రజల కోసం తాను చేసే సేవలు ఆగవని, ఎల్లప్పుడూ వారి సేవలోనే ఉంటానని పేర్కొన్నారు.